# అలక్‌నంద ::

రచన:
శ్రీ ము|| క్రిష్ణమూర్తి పట్నాయక్

శ్రావస్తినగరం, వసంతశోభతో, ఊరంతా అలంకరణలతో కళకళాడుతూ ఉంటుంది. ప్రజలు ఆనందోత్సాహాలతో తేలి ఆడుతూ ఉంటారు. ఒక చోట పెద్ద భవనంలో ఒక విశాలమైన గది. గది మనోహరంగా అలంకరించబడి ఉంటుంది. గోడలకు సుపరిమళాన్ని వెదజల్లే పూలచెండ్లు అందంగా తగిలించబడి ఉంటాయి. వందలాది ప్రమిదల్లో దీపాలు వెలుగుతూ ఉంటాయి. నేలమీద అతిమృదువైన రత్నకంబళం పరిచి ఉంటుంది. సందులేకుండా నగరంలోని గొప్పగొప్పవాళ్ళు ఉంటారు. నగరంలోనికన్నా ధనికుడైన పురందరుడు ఆ సభకు పెద్ద.

ఆ సభలో అందాలభరిణి, సుప్రసిద్ధ నాట్యకత్తె అయిన అలక్‌నంద నాట్యమాడుతూ ఉంటుంది.

ఒక సభికుడు: ఆహా! ఈమె ఆ దేవలోకంలోని రంభా?

ఇంకొక సభికుడు: కాదు. ఊర్వశి!

ఒక కవి: కాదు, అంతకన్నా గొప్పది! ఆ జగన్మోహిని!! ఏమిటి ఈ సౌందర్యం! ప్రపంచంలోని సౌందర్య సంపదంతా ఈమెలోనే ఉందా? ఆ సువిశాల సునిశిత ప్రభాసమన్వితమైన కళ్ళు, ఆ పొడవైన సూటైన సంపంగి పూ ముక్కు. ఆ చిన్నని సన్నని ఎఱ్ఱని పెదవులు, ఆ వంపు దేరిన మనోజ్ఞమైన సన్నని నడుము, ఆ స్వచ్ఛమగు స్వర్ణవర్ణచ్ఛాయతో కూడిన శరీరం, ఆహా!

మరొక సభికుడు; ఆ అందానికి ఆ నాట్యం ఎలా అమరి ఎలా ఆహ్లాదాన్ని కలిగిస్తోంది! సాక్షాత్తు ఆ భరత ముని శిష్యురాలేను! ఏమిటీ నాట్యం! ఏమిటీ నాట్యం!

ప్రక్కతను: ఆ నాట్యానికి కమనీయమైన కంఠ ఎంత కుదిరింది? ఆహా! గంధర్వ కన్యా? కోకిలరాణా?

చాలమంది; ఈ సౌందర్యరాణి, ఈ నాట్యకత్తె, ఈ గాయని ఎవరికి లభిస్తుందో! ఎవరు పుణ్యాత్ములో!

పురందరుడు: (తనలో) నాకు లభిస్తుంది. నన్నే వరిస్తుంది. ఈ శోభనదేవిని నా భాగ్యరాలిగా చేసుకుంటాను, నా ఆరాధ్య దేవతగా కొలుస్తాను, సార్వస్వంగా పరిగణిస్తాను.

(నాట్యం మాంచి రక్తికడుతూ ఉంటే ప్రేక్షకులు తన్మయులై తదేకదృష్టితో చూస్తూ ఉంటారు. సభంతా చీమ చిటుక్కుమన్నా నిశ్శబ్దం వ్యాపిస్తుంది. అంతలో ఆ నిశ్శబ్దాన్ని భంగం కలిగిస్తూ ద్వారంవద్ద పెద్దగా కేక వినబడుతుంది.)

సన్యాసి: (ఆజానుబాహువు, మేధావి, జ్ఞానజ్యోతి ముఖంలో ప్రతిబింబిస్తూ ఉంటుంది. కాషాయవస్త్రాలు ధరించి ఉంటాడు, భిక్షాపాత్ర పట్టుకొని ద్వారంవద్ద నిలుచుని) భిక్షాందేహి! భిక్షాందేహి!!

(త్రుళ్ళిపడి అలక్‌నంద నాట్యం మధ్య ఆగిపోతుంది. వాద్యగాళ్ళు వాద్యంలో తడబడతురు. ప్రేక్షకులు భంగపాటుగా ద్వారంవైపు చూస్తారు.)

సన్యాసి: (శాంతగంభీరాలతో) భిక్షాందేహి! భిక్షాం....

పురందరుడు: (కోపంతో విషపూరితమైన దృష్టితో


మీ ఆభరణాలకు
అత్యుత్తమమైనది




అజంతా
వజ్రములే!!

చూసి) ఇక్కడ ముష్టి దొరకదండి స్వామీ! బయట దొరుకుతుంది, అటు వెళ్ళనిలవండి.

అలక్‌నంద, వినతా! (దాసి వినత వచ్చి నిలుచుంటుంది.)

పురందరుడు: (కోపంగా) ఎవరు దాన్ని ఇక్కడకు రమ్మన్నారు? ఇది ముష్టి అడిగేచోటా? (భయంతో దాసి, ఏమీ మాటాడదు. సన్యాసి మౌనంగా ప్రశాంతమైన దృష్టితో అలక్‌నందవైపు చూస్తూ ఉంటాడు.)

అలక్‌నంద; సన్యాసికి భిక్షపెట్టు, వినతా! మరెవరికీ ఇక్కడికి రానీకు వెళ్లు.

(తిరస్కృతి నుంచి తప్పించుకొని వినత వెళ్ళిపోతుంది. సన్యాసి ధృఢగంభీరాలతో మౌనంగా నిలుచుంటాడు.)

అలక్‌నంద: ఇదేమిటి దాని వెంట వెళ్ళలేదు మీరు! వెళ్ళండి. భిక్ష పెడుతుంది.

సన్యాసి: నాకు ధనం అక్కరలేదు, రమణీ!

అలక్‌నంద: అయితే ఏంకావాలి ప్రభూ? నగలా? నా రత్నాల గాజులా?

సన్యాసి: లేదు! (పెదవులపై చిరునవ్వు తాండవిస్తుంది.)

పురందరుడు: (ఆశ్చర్యపోయి మహాకోపంతో కేకలేస్తాడు.) అయితే ఏంకావాలిమరి ముత్యాలహారాలా?

అలక్‌నంద: తీసుకుంటారా! నా ముత్యాలహారాలు పుచ్చుకుంటారా?

సన్యాసి: లేదు! (మళ్ళా పెదవులపై నవ్వు కనబడుతుంది.)

పురందరుడు: కోపంతో వెఱ్ఱి వాడిలా అయిపోయి గట్టిగా) వాడికి ఏది కావాలో అది ఇచ్చేసి ఇక్కడనుంచి వాణ్ణి తోలెయ్ అలక్‌నందా! వాడి చూపులు శూలాల్లా నన్ను పొడుస్తున్నాయి.


ENJOY BY SMOKING THE GREAT
3 HORSE BEEDIES

3 గుఱ్ఱ ముబీడి

శ్రేష్ఠమైన పొగాకుతో తయారు కాబడిన 3 గుఱ్ఱముల బీడీలను కాలాది కాలమునుంచి వాడుతూ, మన ఆంధ్రరాష్ట్రములో లక్షలాది ప్రజలు ఆనందమును, ఉత్సాహమును పొందుచున్నారు. శ్రేష్ఠమైన 3 గుఱ్ఱముల బీడీలతో ఇతర రకముల బీడీలను, విలువైన సిగరెట్లను పరీక్షించిన వాటి విలువ మీకే తెలియును.

3 గుఱ్ఱముల బీడి కంపెనీ,
విజయనగరం సిటీ

3 HORSE BEEDI COMPANY, VIZIANAGARAM CITY

Telegram : THREE HORSE
Telephone : 6

(ప్రేక్షకులంతా మండిపోతారు. ఆ నవ్వులోని వ్యంగ్యం వారిని చురికిస్తుంది.)

అలకనంద: (కుతూహలంగా) మీకు తెలీదు స్వామీ, ఇది చాల ఖరీదుగల హారం. ఏ రాజసన్నిధినీ ఇటువంటి ముత్యాలు లేవు. వీటిబదులు సులభంగా ఒక పెద్ద రాజ్యం దొరక గలదు.

సన్యాసి: నాకు రాజ్యతృష్ణలేదు, నేను భిక్ష అడుగుతూన్నాను.

జయపాలుడు: (పురందరుని ప్రాణస్నేహితుడు. నవ్వి వ్యంగంగా) అయితే భిక్షే కావలసివస్తే ఏది ఇస్తే అది తీసుకో! ఈ ఏడ్పేమిటి?

(ప్రేక్షకులు తృణీకారంగా నవ్వుతారు. అలకనంద పెదవులపైకూడా నవ్వు దొర్లుతుంది.)

అలకనంద: అయితే మీకు ఏంకావాలి?

సన్యాసి! నాకు భిక్షగా నువ్వు కావాలి! (అతని స్వరంలో .అపూర్వమైన ధృఢత్వం, కళ్ళలో విజయ సూచకమైన మందహాసం ప్రతిబింబిస్తాయి, సభికులు త్రుళ్ళిపడతారు. వారిమీద పిడుగు పడ్డట్టు అవుతుంది.)

ఒక సభికుడు: వీడు ఓ పిచ్చివాడిలా ఉన్నాడు! ఎవరినైతే వేలకొలది సొమ్ము గ్రుమ్మరించినాకూడా ఓ క్షణం పొందడం కష్టమో, ఎవరిదయ సంపాదించేందుకు గొప్ప ధనవంతులూ, అందగాళ్ళూ, రాత్రీ పగలూ కొట్టుకుంటూంటారో ఆమె ఈ ముష్టివాడికోవాలి!

మరొకడు: నక్క ఎక్కడ, దేవలోకం ఎక్కడ?

ఇంకొకడు: వల్లకాట్లో!

(పురందరుడు, తక్కిన సభికులు పెద్దగా నవ్వుతారు, అలకనందకూడా నవ్వుతుంది.)

అలకనంద: నేను కావాలా? ఎందుకు?

సన్యాసి: భగవాన్ బుద్ధుని ఆజ్ఞచేత,

అలకనంద: మీరు—మీరు ఎవరు?

సన్యాసి: నేను సుదత్తుణ్ణి. భగవాన్ బుద్ధుని ఒక దీన సేవకుణ్ణి.

అలకనంద: అయితే మీరు సంసారత్యాగులు. భోగ సుఖ రహితులైన సన్యాసులు!

సన్యాసి: అయినా నువ్వు కావాలి.

అలకనంద: నేను ఒక నర్తకిని. నాకు ధర్మం తెలీదు! విలాసం నారూపం. నిర్లజ్జనాభూషణ. నన్ను తీసికెళ్తే మీకు గొప్పహాని కలుగుతుంది స్వామీ!

సన్యాసి: రమణీ, మేము లాభనష్టాల్ని పరిగణించం; మేము సన్యాసులం. కర్మలో మాకు అధికారం ఉంది— ఫలితాన్ని మేము ఆశించం.

అలకనంద: మీరు ధార్మిక జీవితాన్నుంచి వైదొలగిపోతారు.

సన్యాసి: ధర్మం ఎప్పుడూ నశించదు, ధర్మం గాజుసామాను కాదు. కొంచెం దెబ్బతగలగానే ముక్కముక్కలై పోడానికి, ఏ ధర్మాన్నైతే ఒకమారు పొందానో, దాన్ని ఇక పోగొట్టుకుంటాననే భయం నాకు లేదు. (నవ్వుతాడు)

గమనింపుడు! గమనింపుడు!!

మీ మేలుకొరకు గమనింపుడు!!!

మీకు ఆకలి లేకున్నను, జీర్ణశక్తి లేకున్నను ఎముకలు చర్మము మాత్రము తెలియుచుండునట్లు శరీరము కృశించియుండినను కన్నులు గుంటలు పడినను జ్ఞాపకశక్తి కొంచెమైనను లేకుండినను మలబద్ధముచేత బాధపడుచుండినను ధైర్యము చురుకుదనము లేకుండినను శుక్లము బాగిగా లేకుండినను మేహరోగముచేత పీడింపబడి యుండినను మాయొక్క "ఆనంద కుసుమాకర లేహ్యము" ను తెప్పించి పుచ్చుకొందురేని 6 వారములులోగా నిటువంటి మహా వ్యాధులనుండి తప్పించుకొని సౌఖ్యము పొందగలరు.

డబ్బి 1-కి రూ. **2-50**

మలయాళ మెడికల్ హాల్

**(Regd)**

పోస్టుబాక్సు నెం. 27.

౧౮౫, వక్కీల్ కొత్తవీధి, మధురై.

అలక్‌నంద: (ఆశ్చర్యపోయి) నన్ను ఎక్కడికి తీసి కెళ్తారు?

సన్యాసి: భగవాన్ బుద్ధుని చరణ సన్నిధికి!

అలక్‌నంద: అందువల్ల నాకేమి లాభం?

సన్యాసి: ముక్తి!

అలక్‌నంద: ముక్తి! నాకు ముక్తి వద్దు స్వామీ! జీవితంలోని అనేక కోరికలు ఇప్పటికీ నెరవేరలేదు. అనేక వాంఛలు ఇప్పటికీ నెరవేరలేదు స్వామీ, నాకు సన్యాసం అక్కరలేదు. ఈ అగణితమైన సిరిసంపదలు భోగవిలాసాలు, కీర్తి గౌరవాలు విడిచి అడవిలో గుహలో కందమూలాలు తింటూ సన్యాస జీవితాన్ని గడిపేందుకు నేను వెఱ్ఱివాన్నికాను, (స్వర్గంలో ఒకవిధమైన ఆర్త నాథం కనబడుతుంది.

సన్యాసి:-(ప్రపంచాన్ని జయించే నవ్వు అతని ముఖంలో తాండవిస్తుంది. ఆ నవ్వులో ఎట్టి కల్మషం వుండదు. కేవలం కరుణారసం ఉట్టిపడుతూంటుంది.) హృదయంయొక్క దీనత్వాన్ని భోగవిలాసాల ఆవరణలో దాచి ఉంచలేము. బొగ్గుల్లో ఉంచిన అగ్గిలా అది లోపలా బయటా అంతా మాడ్చివేస్తుంది. అందుచేత మానవుని దీనత్వం అతని కళ్లల్లో, ముఖంలో శరీరంలో కూడా ప్రతిబింబిస్తూ ఉంటుంది. నీవు నీహృదయం దీనతను బయటి విలాసపు టావరణలో కప్పిపుచ్చడానికి ప్రయత్నించి దెబ్బతింటూన్నావు! రమణీ! ఈ ఆవరణ పూర్తిగ మధ్య భోగంలో ఆనందం దొరకదు-త్యాగంలో దొరుకుతుంది. కోర్కెలకూ, మనోరధులకూ అంతు లేదు. నీవు ఎంతగా భోగాన్ని అనుభవిస్తావో అంతగా నీకోర్కెలు ఆజ్యంపోసిన అగ్నిలా వృద్ధి అవుతూనే ఉంటాయి.

(అలక్‌నంద ఏమీ జవాబివ్వక అతని ముఖంవైపు చూస్తూ ఉంటుంది. పనికిరాని కోపంతో సభికులు కేకలు వేస్తారు.)

సన్యాసి:-శోక దుఃఖవ్యధలతో నిండిన ఈ జీవి



తాన్ని ఎందుకు వాంఛిస్తూన్నావు బాలా ? నాతోరా. దివ్యమైన జీవితాన్ని నీకు ప్రసాదిస్తాను. అందులో శోకం ఉండదు; దుఃఖం ఉండదు; వృధా ఉండదు. కేవలం మహానంద సుఖాలే ఉంటాయి. ఇక్కడ సుఖం లేదు. దుఃఖపాశాలు ఉన్నై. నీవు మోహంతో అంధురాలవైనావు. అందుచేత నీవు సుఖమనే భ్రమతో చేజేతులా దుఃఖమనే ఉరితాడును నీ గొంతుకకా చుట్టుకున్నావు. ఇది వైభోగంకాదు బాలా—ఇది ఆత్మహత్య; విలాసభోగాల మధ్య నీవు నీ సత్యమార్గాన్ని మరచిపోయావు. అందుచేత త్యాగదీక్షను ఇచ్చి సత్యమార్గాన్ని ఉపదేశించడానికి వచ్చాను. విప్పిపారవెయ్ నీ ఆవిలాసపు ఉపకరణాలు—ఆ బట్టలు, అలంకరణాలు। తుడిచివెయ్ నీ మనోవాంఛల ఆ నల్లని కళ్ళ కాటుక! కట్టుకో ఎఱ్ఱని సన్యాసివస్త్రాలు. చూడు వాటిలో ఎంతటి శాంతి సంతృప్తులు ఉంటాయో।

(అలక్‌నంద తన కాళ్ళగజ్జెలు దూరంగా పారవేస్తుంది. సన్యాసి కాళ్ళపైపడి)

అలక్‌నంద :–నా యీ జీవితంలో మీమాటలు సత్యం కానీయండి మహాత్మా !

(సన్యాసి ఆమెను ఎంతో స్నేహంతో లేవనెత్తుతాడు. అతని కళ్లల్లో ఆనందం, ముఖంలో గర్వం ప్రతిఫలిస్తాయి. అచంచలమైన మనస్సుతో ఆమె ఆభరణాలను మెల్లిమెల్లిగా తీసివేస్తాడు. తొణకని చేతులతో తన ఎఱ్ఱని దుప్పటి ఆమెమీద పడవేస్తాడు. ఆమె నుదుట రక్తచందనం బొట్టుపెట్టి వేస్తాడు. క్షణంలో ఆమె బౌద్ధ భిక్షుకురాలు అయిపోయింది. సభికుల్లో హాహాకారాలు చెలరేగుతాయి.)

సభికులు :–అయ్యో ! అయ్యో ! ఇదేమి ఘోరం ! సన్యాసిని అయిపోతావా అలక్‌నందా ? వద్దు వద్దు, శ్రవస్తి నగరాన్ని అంధాకారంలోముంచి సన్యాసినవై వెళ్ళిపోవద్దు !

అలక్‌నంద :–నన్ను నా ముక్తిమార్గాన్నుంచి మరలించవద్దు మిత్రులారా. ఈ జీవితంలో ఏ సత్యాన్నైతే పొందలేదో ఆ సత్యాన్ని అన్వేషించడానికి వెళ్తున్నాను, నన్ను మరి పిలవవద్దు స్నేహితులారా !

సన్యాసి :– బుద్ధం శరణం గఛ్ఛామి
ధర్మం శరణం గఛ్ఛామి
సంఘం శరణం గఛ్ఛామి.

అలక్‌నంద:–బుద్ధం శరణం గఛ్ఛామి
ధర్మం శరణం గఛ్ఛామి
సంఘం శరణం గఛ్ఛామి,

(ముందు సన్యాసి, వెనక అలక్‌నంద రహదారిగుండా వెళ్ళిపోతూంటారు. అసంఖ్యాకులైన పురజనులు విస్తుపోయి నిశ్శబ్దంగా చూస్తారు. క్షణంలో ఇద్దరు ఊరు దాటి మాయమౌతారు.)


త్వరలో వెలువడ నున్నవి

"తు ది ఘ డి య"
(డిటెక్టివ్ నవల) రచన :–రాజులు

"తీ రి న ప గ"
(డిటెక్టివ్ & సోషల్ నవల)
రచన :– రాజులు

పై నవలలు ఏకవర్ణ ముఖచిత్రంతో అత్యంత మనోహరంగా రియల్ ఆర్టుపేపరుపై ముద్రింపబడి పాకెట్ సైజులో త్వరలో వెలవడుతున్నవి,

ఒక్కొక్క దాని వెల ;—40 నయాపైసాలు,

ఏజంట్లకు 25% కమీషను.

ఏజంట్లు తమ ఆర్డరుతో బాటు సొమ్ము ముందుగా పంపి ప్రతులను సకాలములో తెప్పించుకోగోర్తాము.

టామి పబ్లికేషన్స్
చీమకుర్తి., గుంటూరు జిల్లా.